క్లుప్తంగా

చాముండేశ్వరిదేవిగా రాజరాజేశ్వరిదేవి


ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన రాజ రాజేశ్వరి అమ్మవారు

బొండపల్లి: వారాహి నవరాత్రుల్లో భాగంగా దేవుపల్లిలో వెలసిన రాజరాజేశ్వరిదేవి గురువారం భక్తులకు చాముండేశ్వరిదేవిగా దర్శనమిచ్చింది. నవరాత్రుల్లో భాగంగా 6వ రోజు అమ్మవారిని అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ప్రత్యేకంగా పూలాంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక వంటకాలు చేసి నైవేద్యాలు పెట్టి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన కుంకుమ పూజలను చేయడంతో పాటు, పూజలకు తరలివచ్చిన భక్తులు గాజులును అమ్మవారికి సమర్పించారు.

ఆకస్మిక తనిఖీ


వంటలను రుచి చూస్తున్న ఎంఈఓ-2 సాయిచక్రధర్

గజపతినగరం : ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం (పీఎం పోషణ)అమలులో వంటలు నాణ్యంగా ఉన్నది లేనిది ఎంఈఓ - 2 సాయిచక్రధర్ క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. గజపతినగరం బాలుర హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులంతా మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకున్నది లేనిది సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటలు నాసిరకంగా లేకుండా నాణ్యంగ ఉండేలా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరరావు, సీఆర్‌పీ రామసూరారెడ్డి ఉన్నారు.

వాహనదారులకు అవగాహన


ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

గజపతినగరం: హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలను నడపరాదని గజపతినగరం సివిల్ కోర్టు న్యాయవాదులు జె.జగదీష్, పి.శ్రీనివాసరావు, కె.సాయిశేఖర్ సూచించారు. గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి ఆదేశాల మేరకు వారు గజపతినగరం మండల కేంద్రంలో ద్విచక్ర వాహనదారులకు గురువారం అవగాహన కల్పించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చినా, వారికి సహకరించినా అటువంటి వారిపై పోలీసుల ద్వారా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వాహనాలు నడిపిన ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆదినారాయణ, శీర వాసు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన


కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్: పట్టణంలోని రెల్లివీధిలో జెడ్పీ నిధులు రూ.పది లక్షలతో నిర్మాణం జరుగుతున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ కమ్యూనిటీ హాల్ ఆవరణలో మంచినీటి బోరు సదుపాయాన్ని కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ హాల్ నిర్మాణానికి సంబంధించి మిగిలిన నిధులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. వారి వెంట పతివాడ రాజారావు, బెల్లాన త్రినాథ్, ఇప్పిలి తిరుమల, మంగళగిరి శ్రీను, దాలయ్య, వాసు, పైడిరాజు, ముజీక్కీర్, కృష్ణ, ప్రభాత్, శ్రీను, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

‘తల్లికి వందనం’ కోసం ఆశగా..


చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో

ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పక్షాన ఇచ్చిన హామీల్లో ఒకటైన తల్లికి వందనం పథకం కింద జమ కావాల్సిన డబ్బులు ఇంకా జమ కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వాటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జూన్ నెలలోనే తల్లుల ఖాతాలో అమ్మ ఒడి పేరిట ఈ నిధులు జమ అయ్యేవి. జూలై రెండో వారం కావస్తున్నా ఇంకా ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం డబ్బులు జమ చేయకపోవడంతో అవస్థలు పడుతున్నామని తల్లులు వాపోతున్నారు. ఒక ఇంట్లో ఎంత మంది చదివితే వారందరికీ ఈ డబ్బులు తల్లుల ఖాతాల్లో వేస్తామని ఎన్నికల వేళ చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. కానీ ఒకరికీ కూడా నేటి వరకు డబ్బులు జమ కాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తుండడంతో కూటమి నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎదురు చూస్తున్నాం...



గత ప్రభుత్వం అమ్మ ఒడి డబ్బులు మొత్తం ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుతం చంద్రబాబు సర్కారు ఎందరు పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకంలో ఒక్కో విద్యార్థికి రూ.15వేలు చొప్పున తల్లి ఖాతాకు సొమ్ము జమ చేస్తామన్నారు. మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లల చదువులు గట్టెక్కుతాయని ఆశగా ఎదురు చూస్తున్నాం.

– కొరువాడ భారతి. ఎస్.కోట.

సొమ్ములు వేస్తే ఫీజులు కడతాం



చంద్రబాబు సర్కారు తల్లికి వందనం ఎందరు పిల్లలు ఉన్నా, స్కూల్లో చదివిస్తే ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. చంద్రన్న సొమ్ములు ఇస్తే పిల్లల ఫీజులు కడదామని చూస్తున్నాం. ఇద్దరు పిల్లలు ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. ఇంత వరకూ సొమ్ములు వేయలేదు.

– పరశురాం శ్రీవాణి. ఎస్.కోట

నగదు జమ చేయాలి



గతంలో జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థుల తల్లులు ఖాతాలో అమ్మ ఒడి నగదు వేసే వారు. ప్రభుత్వం మారి నెల రోజులు దాటింది. ఎప్పుడు వేస్తారో తెలియని పరిస్థితి. సకాలంలో వేస్తే పిల్లలు చదువులకు ఉపయోగపడుతుంది

– బంకపల్లి కుమారి, దత్తిరాజేరు గ్రామం

మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం డబ్బులు వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. చెప్పిన మాట ప్రకారం సకాలంలో తల్లులు ఖాతాలో ఆ డబ్బులు వేయాలి.

– కిల్లాడ రాజేశ్వరి, వంగర, దత్తిరాజేరు మండలం

విధి విధానాలు లబ్ధిదారులకు తెలియాలి



గతంలో ఇంట్లో ఒకరికి మాత్రమే అమ్మ ఒడి వేస్తామని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. చెప్పిన మాట ప్రకారం తల్లుల ఖాతాలో రూ.15వేలు నగదు జమ చేసారు. పిల్లలకు కావలసిన విద్యా సామగ్రి, వస్తు సామగ్రికి ఉపయోగపడేవి. కొత్త ప్రభుత్వం వచ్చి నెల రోజులవుతున్నా విధి విధానాలు తెలియజేయలేదు. అందరికీ వస్తుందా.. రాదా.. తెలియని పరిస్థితి. –పోలిపల్లి మహంకాళి, వంగర

మాట తప్పకూడదు..



ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా ఇంట్లో ఎంత మంది పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం డబ్బులు వేయాలి. ఇచ్చిన మాట తప్పకూడదు. త్వరగా డబ్బులు వేస్తే పిల్లల ఫీజులు కట్టే అవకాశం ఉంటుంది.

– అగురుపల్లి భాగ్యలక్ష్మి, టి.భూర్జవలస, దత్తిరాజేరు మండలం

సకాలంలో ఖాతాలో జమ చేయాలి



తల్లికి వందనం డబ్బులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సకాలంలో జమ చేయాలి. ఇప్పటికే నెల రోజులు ఆలస్యమైంది. ఇంకా ఎప్పుడు వేస్తారో తెలియక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎంత మందికి వేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

– బోడసింగి జ్యోతి, బోడసింగిపేట, బొండపల్లి మండలం

హామీ అమలు చేయాలి



విద్యార్థుల తల్లులకు అమలు చేస్తామన్న తల్లికి వందనం పథకం వెంటనే అమలు చేయాలి. కూటమి నేతలు ఇచ్చిన హామీ అమలు చేసి విద్యార్థుల చదువులకు బాసటగా నిలవాలి. లేనిపోని నిబంధనలు పెట్టడం సరికాదు. సకాలంలో ఆ డబ్బులు తల్లుల ఖాతాలో వేయాల. – ఆల్లి ఆదిలక్ష్మి, గజపతినగరం

చదువులకు సహకరించాలి



తల్లికి వందనం పేరిట కొత్త ప్రభుత్వం అమలు చేయదల్చిన పథకం నిధులు వెంటనే తల్లుల ఖాతాల్లో వేయాలి. పిల్లల చదువులకు సహకరించాలి. గతంలో జగనన్న ప్రభుత్వం జూన్ నెలలోనే అమ్మ ఒడి పథకం కింద ఈ డబ్బులు సకాలంలో వేసేది. ప్రస్తుత ప్రభుత్వం ఎంత మంది పిల్లలు చదివితే అంత మందికీ ఈ డబ్బులు వేస్తామని హామీ ఇచ్చింది. ఆ మాటను నిలబెట్టుకోవాలి.

– బంకపల్లి అచ్చియ్యమ్మ, కెంగువ, గజపతినగరం మండలం

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

గుర్ల: మండలంలోని తెట్టంగి, గుర్ల గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు గురువారం చేపట్టారు. పారిశుద్ధ్య పనులను ఆయా సర్పంచ్‌లు జమ్ము పార్వతి, రమణమ్మ ఆధ్వర్యంలో చేపట్టారు. కాలువలలో పూడికలు తొలగించారు. చెత్త చెదారాలను తొలగించి మురుగు నిల్వ లేకుండా చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

పెదమానాపురంలో..

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా చేస్తున్నట్లు సర్పంచ్ గొటివాడ దాసు గురువారం తెలిపారు. గ్రామంలోని అన్ని మురుగునీటి కాలువులలో చెత్త చెదారాలను తొలగించినట్లు తెలిపారు. పూడికలను డంపింగ్ యార్డ్‌కు తరలించి పంచాయతీ నిధులతో తాగునీటి బావులు చేతి బోర్లు వద్ద క్లోరినేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు.


గుర్ల: తెట్టంగిలో కాలువలలో పూడికలు తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వీఆర్‌ఓలు అందుబాటులో ఉండాలి

దత్తిరాజేరు: అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న వీఆర్‌ఓలు ఆయా పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సుదర్శన సూచించారు. రైతులు వివిధ పనుల మీద సచివాలయాలకు వచ్చినప్పుడు వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. తమ పరిధిలో పరిష్కారం కాని సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వేపాడ: మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించిన ఎంఈఓ విద్యార్థులతో పాటు భోజనం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. దబ్బిరాజుపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు గురువారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలను, భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబలయ్యపాలెంలో వైద్య శిబిరం

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెంలో బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమాదేవి నేతృత్వంలో నిర్వహించిన శిబిరంలో 16 మందిని పరీక్షించారు. వీరిలో ఐదుగురికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో హెచ్ఎస్ పీఎస్ఆర్ మూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, హెచ్‌ఏ శేఖర్, వెంకటరావు, దాలినాయుడు, ఆశా వర్కర్లు తమ వంతు సేవలు అందించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు


చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది


ట్రిపుల్‌ఐటిలో సీట్లు సాధించిన కొట్టాం హైస్కూల్ విద్యార్థులు



లోచర్ల గీతిక


మనోజ్‌నాయుడు


గుషిడి రేణుక


చిట్టి శ్రావణి


వనిత


రామచరణ్


హిమబిందు


అక్షయ


సాయి దుర్గా లోకేష్


ప్రేమ్‌కుమార్


మాధురి


హాసిని


దిలీప్‌కుమార్


వై.గీత


ఎన్.కుసుమ

చీపురుపల్లి రూరల్(గరివిడి): చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం రహెనాబేగం తెలిపారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినిలు లోచర్ల గీతిక, బి.నళిని, శ్రీవైష్ణి, ఎస్.ఝాన్సీ, ఐ.మల్లిక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతికి చెందిన విద్యార్థి షేక్ తాజ్‌నసీమ్ నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించాడు. గరివిడి మండలం తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దన్నాన మనోజ్‌నాయుడు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు.

ఇద్దరి ఎంపిక

గుర్ల: మండలంలోని పెనుబర్తికి చెందిన గుషిడి రేణుక ఐఐఐటీ నూజివీడు, పున్నపురెడ్డిపేటకు చెందిన చిట్టి శ్రావణి ఐఐఐటీ ఒంగోలుకు ఎంపికయ్యారు. గుషిడి రేణుక గరివిడి హైస్కూల్ ఇంగ్లిష్ మీడియం, శ్రావణి గుర్ల కేజీబీవీలో చదువుకున్నారు.

ఐదుగురు ఎంపిక

గంట్యాడ: మదనాపురం మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ పాఠశాలకు చెందిన బి.వనిత, కె.సాయి దుర్గాలోకేష్, ఎస్.హిమబిందు, వి.అక్షయ, టి.రామచరణ్ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణారావు అభినందించారు.

సత్తా చాటిన విద్యార్థులు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి సత్తా చాటారని హెచ్.ఎం పి.విజయరామ్‌కుమార్ తెలిపారు. పాఠశాలకు చెందిన బొడబల్ల పూజిత – నూజివీడు, బీల అవినాష్ – ఒంగోలు, గెడ్డాపు కార్తీక్ – శ్రీకాకుళం ఐఐఐటీల్లో సీట్లు సాధించారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జామి ప్రేమ్‌కుమార్ – నూజివీడు, మండ మాధురి – శ్రీకాకుళం, భోని హాసిని – నూజివీడు ఐఐఐటీలకు ఎంపికయ్యారని హెచ్.ఎం ఉమామహేశ్వరరావు చెప్పారు. వెంకటరమణపేట జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మైచర్ల దిలీప్‌కుమార్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్. ఎం.కె.లక్ష్మి తెలిపారు.

11 మంది ఎంపిక

కొత్తవలస : మండలంలోని అర్దన్నపాలెం గ్రామ సమీపంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో 2023 – 24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన 11 మంది విద్యార్థులు రాష్ట్రంలో గల వివిధ జిల్లాల్లో గల ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ తెలిపారు. ఒకే స్కూల్ నుంచి ఇంతమంది ఎంపికవడం ఇదే ప్రథమం కావడం విశేషం. లక్కవరపుకోట మండలం చందులూరు పాఠశాలకు చెందిన ఎన్.కుసుమ శ్రీకాకుంళం ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు హెచ్‌ఎం గోవిందరాజు తెలిపారు. వీరభద్రపేట గ్రామానికి చెందిన యేడువాక గీత శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది.


అశ్విని

కేజీబీవీ విద్యార్థిని ఎంపిక

మెరకముడిదాం: మండల కేంద్రంలో వున్న కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన వై.అశ్విని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆ పాఠశాల ఎస్‌ఓ గొష్యాబేగం తెలిపారు.

విద్యార్థుల సత్తా

వేపాడ : మండలంలో బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు గురువారం తెలిపారు. సీట్లు సాధించిన వారిలో ఐఐటీ న్యూజివీడు బ్రాంచికి ముమ్మన యామినీ, ఉల్లి ఎరునాయుడు, గేదల మేఘన, ఐఐఐటీ ఒంగోలు బ్రాంచికి లండ బాల చంద్రకళ, ఐఐఐటీ శ్రీకాకుళం బ్రాంచికి సుంకరి హరిణి, గుమ్మడ చరణ్ కుమార్, రొంగలి మేఘన, ఎర్రంశెట్టి మానస ఉన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం


ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనాభా దినోత్సవ సభ


ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వియ్యంపేట పీహెచ్‌సీ సిబ్బంది

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని అర్థశాస్త్ర విభాగం నేతృత్వంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ సి.హెచ్. కేశవరావు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల ప్రపంచానికి కలిగే లాభాలు, అదే సమయంలో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. దేశ అభివృద్ధిలో యువ జనాభా ఆవశ్యకతను, విద్యార్థుల పాత్రను చెప్పారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ క్యాడెట్స్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

కొత్తవలస : మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న కుటుంబం చింతలేని కుటుంబం, ఒకరు ముద్దు –ఇద్దరు హద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని కంటకాపల్లి(ఆర్ఎస్) ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పి.రామచంద్రరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.


గంట్యాడ: ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ హేమలత, తదితరులు

గంట్యాడలో...

గంట్యాడ: జనాభా నియంత్రణలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు కీలకమని గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద గురువారం ప్రపంచ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా 2024 – 25 విద్యా సంవత్సరంలో పని చేసేందుకు అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ గురువారం తెలిపారు. గణితశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, కంప్యూటర్ సైన్సు, జువాలజీ సబ్జెక్టుల్లో బోధన చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఈ నెల 26లోగా అభ్యర్థులు దరఖాస్తులు కళాశాలలో సమర్పించాలని తెలిపారు.

ఏపీజీఈఏ తాలూకా అధ్యక్షుడిగా తేజేశ్వరరావు

కొత్తవలస : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) కొత్తవలస తాలూకా అధ్యక్షుడిగా వై.తేజేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు జిల్లా సంఘం వైస్ ప్రెసిడెంట్ ఎం.అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలకు జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి.ఆర్.అనిల్‌కుమార్ ఎన్నికల అధికారిగా, విజయనగరం టౌన్ కార్యదర్శి బియ్యాల చంద్రశేఖర్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. కొత్తవలస తాలూకా అధ్యక్షుడిగా వై.తేజేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.రమణమ్మ, 8 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యవర్గం మూడేళ్లు ఉండనుంది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు తేజేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు ఉద్యోగులు అభినందించారు.


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎన్నికల అధికారులు

ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలి

బొండపల్లి: ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటూ తమ సమస్యలు పరిష్కరించుకోవడంతో పాటు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉండటం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ ద్వారా సమస్యలను ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ గుర్తించి పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పల ఈశ్వర్రావు పేర్కొన్నారు. అనంతరం మండల అధ్యక్షుడిగా కట్టా శ్రీనివాసరావుతో పాటు సభ్యులుగా కట్టమూరి సత్యనారాయణ, పూసర్ల కృష్ణ, ఎం.శ్రీనివాసరావు, వెంకటరమణతో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకోగా వారందరితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్, నాయకులు తవ్వా మోహన్, కందుల గుప్తా, నానాజీ పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్ర నాయకులు

కంది పప్పు పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక రైతుబజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ నేతృత్వంలో రాయితీపై వినియోగదారులకు ఇవ్వనున్న కంది పప్పు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లలిత కుమారి గురువారం ప్రారంభించారు. ముందుగా ఆమె కొంతమంది వినియోగదారులకు తూకం వేసి కిలో చొప్పున కందిపప్పు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర ఎక్కువగా ఉండటంతో రైతు బజార్ల ద్వారా కిలో కందిపప్పు రూ.160లకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆమె రైతుబజార్‌లో కూరగాయల విక్రయాలను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


వినియోగదారునికి కందిపప్పు ఇస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని పాలవలస ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ అధికారి పి.హరి గురువారం తెలిపారు. కోటగండ్రేడు, కలవచర్ల, గరికివలస, నక్కలపేట, పాలవలస, గోవుపేట, పకీరుకిట్టాలి, కొండగండ్రేడు, ముద్దాడ పేట, గెదేలపేట, మునకాల పేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల పనులు చేపడుతున్నట్టు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్కవరపుకోట : మండలంలోని ఎల్.కోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎల్.కోట రూరల్ ఫీడర్ నిర్వహణ పనులను శుక్రవారం నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఐ.కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లైన్‌లో వైర్లు మరమ్మతులు నిర్వహించనున్న క్రమంలో ఉదయం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్.కోట సీతారాంపురం, గొల్జాం, కళ్లేంపూడి, ముకుందపురం, వేపాడ మండలం పాటూరు, బొద్దాం, కొత్తబొద్దాం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన ఓ వివాహిత ఈ నెల 8వ తేదీ నుంచి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గంగరాజు గురువారం తెలిపారు. వివాహిత అదృశ్యంపై ఆమె కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడతో ఫిర్యాదు చేశారని చెప్పారు.